సాక్షి
కర్నూలు
శనివారం । 25 । జనవరి । 2025



నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శుక్రవారం కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన టి.నాగ భూషణ్ బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారం గుంటూరుకు చెందిన బండి శివారెడ్డి రూ.1,00,011విరాళం అందించారు.



దారంతా యంత్రానికే..

పాణ్యం: చైన్నై నుంచి హైదరాబాదు వైపు శుక్రవారం ఓ వాహనంపై భారీ యంత్ర పరికరాన్ని తరలించారు. మార్గమధ్యలో వాహనం పాణ్యం వద్ద బ్రిడ్జి ఎక్కలేక పోవడంతో ట్రాఫిక్ స్తంభించింది.

అరాచకం కత్తులు దూస్తోంది!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెలరేగిపోతున్న టీడీపీ మూకలు

- పలు చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్, వీవోఏలు దిగిపోవాలని ఒత్తిళ్లు
- మాట వినకపోతే దాడులు, దౌర్జన్యాలు.. లేదంటే అంతు చూస్తున్న వైనం
- అరికెరలో ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య
- అందరికీ ఇదే గతి అంటూ 'టీడీపీ' పరోక్ష హెచ్చరికలు





రోదిస్తున్న కుటుంబీకులు

హత్యకు గురైన ఆలూరు మండలం అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న

అధికారంలో ఉన్నామనే అహంకారం అరాచకాన్ని సృష్టిస్తోంది. మాట వినకపోతే కత్తులు దూస్తోంది. హత్యలకూ పాల్పడుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల కోసం టీడీపీ శ్రేణులు దౌర్జన్యం చేయడం ఆందోళనకు గురిచేస్తోంది. తమ వారికి గ్రామ సంఘాల సహాయకుల పోస్టులు ఇప్పించాలని వేధించడం అంతటా కనిపిస్తోంది. అధికార పార్టీ నాయకుల బెదిరింపులతో వీవోఏలు ఆత్మహత్యాయత్నాలు చేసుకోవడంతో ఇదేమి పాలన అనే ప్రశ్న ఉదయిస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను కొల్లగొట్టడమే లక్ష్యంగా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల కోసం టీడీపీ నాయకులు దారుణాలకు తెగబడ్డారు. సామ, దాన, దండోపాయాలతో అరాచకం సృష్టిస్తున్నారు. తమ దారికి అడ్డు వచ్చే వారిని తొలగించేందుకు హత్యలు చేస్తున్నారు. గురువారం ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం కైరుప్పలలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడికి పాల్పడ్డారు. శుక్రవారం ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను దారుణంగా హత్య చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేస్తున్నారు. అయినా కొద్ది రోజులుగా ఉద్యోగాన్ని వదులు కోవాలని టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నారు. బెదిరింపులకు పాల్పడుతూ..చివరికి హత్య చేయడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే కలకలం రేగింది. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు వదులుకోకపోతే అందరికి ఇదే గతి పడుతుందని హత్య ద్వారా టీడీపీ నాయకులు హెచ్చరించినట్లు అయ్యింది. ఆలూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను వేలం పెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరు ఎక్కువ మొత్తంలో ముడుపులు ముట్టజెబితే వారికే ఈ పోస్టులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వసూళ్లు ఇలా..

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు టీడీపీ నేతలు భారీగా ముడుపులు వసూలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. పోస్టు విలువను రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 480 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెనువెంటనే ఆదాయ వనరులపై టీడీపీ నేతలు దృష్టి సారించారు. వీరి దృష్టి ప్రధానంగా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులపై పడింది. ఇది ఆలూరు నియోజకవర్గంలో పతాకస్థాయికి చేరింది. జిల్లాలో అంతటా ఈ పరిస్థితి ఉన్నప్పటికీ ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఒత్తిళ్లు, బెదిరింపుల తీవ్రంగా ఉన్నాయి. ఇప్పటి వరకు కొనసాగుతున్న వారిని బెదిరించడం, బుజ్జగించడం ద్వారా వైదొలగేటట్లు పావులు కదిపారు. చివరికి హత్యలకు బరితెగించడం సంచలనంగా మారింది. ఆలూరు నియోజక వర్గానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నా...టీడీపీ అధికారంలో ఉండటంతో ఆపార్టీ నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌నని, తాము చెప్పిన వారినే ఫీల్డ్ అసిస్టెంటుగా నియమించాలని జిల్లా అధికారులపై కూడా ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

టీడీపీ నేతలకు ఏపీఓల వత్తాసు

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులో టీడీపీ నేతలకు ఏపీఓలు వత్తాసు పలుకుతున్నారు. ఆ పార్టీ నేతలకు అడ్డుగోలుగా సహకరించడంలో ఆలూరు నియోజకవర్గంలోని ఏపీఓలు ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. 2014–2018 మధ్య ఏపీవోలుగా పని చేసిన వారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మళ్లీ ఇదే నియోజకవర్గానికి వచ్చారు. ఆస్పరి, ఆలూరు తదితర మండలాల్లో పనిచేస్తున్న ఏపీఓలు ఫీల్డ్ అసిస్టెంట్లను వైదొలగాలని వేధిస్తున్నారు. '' వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమితులైన మీరు కూటమి ప్రభుత్వం రావడంతోనే వైదొలగాలి. సిగ్గూశరం లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొనసాగుతున్నారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని రాజీనామాలు చేసి టీడీపీ వారికి అవకాశం ఇవ్వాలి'' అని ఏపీఓలే ఫీల్డ్ అసిస్టెంట్లను వేధిస్తున్నారు. ఇలా వేధిస్తున్న వారు అధికార పార్టీ నేతలకు ఏ స్థాయిలో సరెండర్ అయ్యారో ఊహించుకోవచ్చు. ఏపీఓలే సహకరిస్తుండటంతో టీడీపీ నేతలు బరి తెగించి హత్యలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ శ్రేణుల అరాచకాలు ఇవీ..

➤ ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌కుమార్‌పై బెదిరింపులు, దాడులకు పాల్పడ్డారు. స్థానిక ఉపాధి కార్యాలయంలోనే టీడీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. ఫీల్డ్ అసిస్టెంట్లపై దాడులకు ఏపీఓనే రెచ్చగొడుతున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

➤ దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామంలో ఒకే ఒక గ్రామైక్య సంఘం ఉంది. ఈ సంఘానికి కొన్నేళ్లుగా ఈ రంగస్వామి గౌడు వీవోఏగా పనిచేస్తున్నారు. ఈయనపై ఎలాంటి ఫిర్యాదులు కూడా లేవు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే టీడీపీ మూకల దృష్టి వీఓఏ పోస్టుపై పడింది. రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. లేదంటే ఇబ్బందులు వస్తాయని బెదిరింపులకు గురి చేశారు. అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో దిక్కుతోచక దాదాపు నాలుగు నెలల క్రితం రంగస్వామి గౌడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

➤ డోన్ మండలం చనుగొండ్ల గ్రామంలో టీడీపీ నేతల వేధింపుల కారణంగా డీఆర్‌డీఏ బుక్ కీపర్ హనుమన్న పురుగు మందు తాగి బలవన్మరానికి పాల్పడ్డాడు. ఒకవైపు టీడీపీ నేతలు, మరోవైపు సీసీలు, ఏపీఎంలు, ఇంకోవైపు పోలీసుల వేధింపులు ఎక్కువ కావడంతో హనుమన్న ఆత్మహత్యకు పాల్పడ్డారని భార్య లక్ష్మి వాపోయారు.



వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన హనుమన్న (ఫైల్)

➤ డోన్ మండలం కొత్తబురుజులో టీడీపీ నేతలు, ఏపీఎం మల్లికార్జున, సీసీ ఈశ్వరమ్మ వేధింపులు ఎక్కువ కావడంతో ఒత్తిడికి లోనైన వీవోఏ వెంకట్రామిరెడ్డి గుండెపోటుతో హఠాత్తుగా మృతిచెందారు. ఇది సర్కార్ హత్యగా వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు.



గుండెపోటుతో మరణించిన వెంకట్రామిరెడ్డి (ఫైల్)

➤ గత ఏడాది నవంబరు నెలలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వేధింపులు ఎక్కువ అవుతుండటంతో ఒక బుక్‌కీపరు ఆత్మహత్యకు ప్రయత్నించారు.

➤ బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వీవోఏ లక్ష్మీదేవిని టీడీపీ నేతల ఒత్తిడి కారణంగా తొలగించారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై కెమికల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు.

న్యూస్‌రీల్

కర్నూలు మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరిధాన్యం క్రయ,విక్రయాలు చేపట్టాలని నిర్ణయించినట్లు మార్కెట్ కమిటీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ముందుకు రావడంతో ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ఈ ప్రక్రియను చేపడుతామని ప్రకటించారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఈయన పాల్గొని మాట్లాడారు. వ్యాపారుల మధ్య పోటీ పెంచి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి లైసెన్స్ పొందిన వ్యాపారులు మార్కెట్‌లో ఈ-నామ్ ద్వారా వరి ధాన్యం క్రయవిక్రయాలు చేపట్టవచ్చని సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంటు సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్, పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

సందర్శకులు సేద తీరేలా నగర వనాల అభివృద్ధి



కర్నూలు కన్జర్వేటర్ యశోదాబాయి

కర్నూలు కల్చరల్: సందర్శకులు సేద తీరేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నట్లు అటవీ శాఖ కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ యశోదా బాయి తెలిపారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో ఆదోని సమీపంలోని కోటేకల్ వద్ద రూ.1.10 కోట్లతో నగర వనాన్ని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కర్నూలు నగర వనంలో రూ.1.40 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నగర వనాల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను మరింత మెరుగు పరుస్తున్నామన్నారు. డోన్ నగర వనానికి సందర్శకులు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. వన్యప్రాణులకు నీటి సౌకర్యం కోసం సాసర్ పిట్‌లు ఏర్పాటు జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): బాల్య వివాహాల వల్ల బాలికల్లో అనారోగ్య సమస్యలు వస్తాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ అన్నారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమం ద్వారా బాల్య వివాహాలు, నెలసరి రుతుచక్రం, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి స్పర్శ-చెడు స్పర్శ అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18, బాలురలకు 21 సంవత్సరాలలోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ వయస్సులో పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల పూర్తిగా ఉండదన్నారు. బాల్యవివాహాలు చేసే తల్లిదండ్రులు, పెళ్లికి హాజరైన వారిపై, పెళ్లి జరిపించిన పురోహితులపై బాల్య వివాహాలు నిషేధిత చట్టం - 2006 ప్రకారం కేసులు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శైలేష్‌కుమార్, కన్సల్టెంట్ మల్లికార్జున, జిల్లా సత్వర చికిత్స కేంద్రం మేనేజర్ ఇర్ఫాన్, డీఈవో మల్లీశ్వరి పాల్గొన్నారు.

మద్దిలేటయ్యలో వైభవంగా తిరుచ్చి మహోత్సవం



మద్దిలేటి నరసింహస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో పుష్య మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ మాఢవీధుల్లో తిరుచ్చి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు వేదపండితులు జ్వాలా చక్రవర్తి, అర్చకులు మనోహర్, మద్దిలేటి నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఊరేగించారు. భారీగా తరలివచ్చిన భక్తజనం మధ్య కాగడాల వెలుతురులో ఈ కార్యక్రమం శోభాయమానంగా సాగింది.

సీఎం చంద్రబాబు ప్రజలకు క్షమాపణలు చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మేయర్ బీవై రామయ్య, పార్టీ నేతలు

- రూ.80 కోట్లు ఖర్చు పెట్టి సాధించిందేమీలేదు
- రెడ్‌బుక్ రాజ్యాంగానికి భయపడి పెట్టుబడులు రాలేదు
- 8 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి లేదు
- విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి
- 5న ఫీజు రీయింబర్స్‌మెంటుపై ఆందోళన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మేయర్ రామయ్య

కర్నూలు (టౌన్): దావోస్ పర్యటనలో రాష్ట్రానికి పైసా పెట్టుబడి తీసుకురాలేని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. దావోస్ పర్యటనలో రూ.80 కోట్లు ఖర్చు పెట్టి బిల్‌గేట్స్‌తో ఫొటో దిగడం తప్పా.. సాధించిందేమి లేదన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో పార్టీ నేతలతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చారన్నారు. సరిగ్గా రెండు స్నరేళ్ల క్రితం కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి ఇదే పెట్టుబడుల సదస్సులో పాల్గొని రూ. 1.26 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. మరో వైపు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించిందన్నారు. మన రాష్ట్రం తరపున వెళ్లిన నారా చంద్రబాబును పెట్టుబడి దారులు ఎందుకు నమ్మలేదని ప్రశ్నించారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు రూ. లక్షల కోట్లు తీసుకువస్తున్నాడని ఎల్లో మీడియా నాలుగు రోజు లు ఊదరగొట్టి చివరకు ఉసూరుమందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుండటంతో పెట్టుబడి దారులు భయపడి ముందుకు రావడం లేదన్నారు. దావోస్ సదస్సును చంద్రబాబు నాయుడు కేవలం రాజకీయాలకు వాడుకున్నాడని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎదుగుదలను జీర్ణించుకోలేని చంద్రబాబు తన ఎమ్మెల్యేలు, మంత్రులతో తన కుమారుడు లోకేష్‌ను ఉపముఖ్యమంత్రి చేయాలని డిమాండ్ చేయించడం విడ్డూరంగా ఉందన్నారు.

➡ పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం వల్లే ప్రజలు, వ్యాపారులు, పెట్టుబడి దారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. 8 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అటకెక్కిందని విమర్శించారు.

➡ మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు.. అబద్ధాలతో ఇంకెంత కాలం ప్రజలను మోసం చేస్తావని ప్రశ్నించారు. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం వల్లే రాష్ట్రానికి రావాల్సిన రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయన్నారు. పెట్టుబడులు రాక ముఖం చాటేసిన చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారన్నారు.

5న ఫీజు రీయింబర్స్‌మెంటుపై ఆందోళనలు

రాష్ట్ర వ్యాప్తంగా రూ. 3,500 కోట్ల విద్యార్థుల ఫీజు బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించ లేదని ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఫీజు చెల్లించకపోవడంతో విద్యా సంస్థలు పరీక్షలు రాయనీయడం లేదన్నారు. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులను ఏకం చేసి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఫీజు కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. భారీ ధర్నా చేసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

రాజ్‌భవన్‌కు మహానంది విద్యార్థిని



విద్యార్థిని గీతావాణి

మహానంది:రిపబ్లిక్‌డే వేడుకల సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించే అట్ హోమ్ కార్యక్రమానికి మహానంది మోడల్ స్కూల్ విద్యార్థిని గీతావాణికి ఆహ్వానం అందినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడల్ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గీతావాణి ఇటీవల జాతీయ స్థాయికి ఎంపికైన జీవవైవిధ్యం ప్రాజెక్టులో ప్రధాన భాగస్వామి అన్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో గీతావాణి ఒకరన్నారు. రాజ్‌భవన్‌కు రావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ జాయింట్ సెక్రటరీ నుంచి ఆహ్వానం అందినట్లు చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు వేగవంతం



పాతాళగంగ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: వచ్చేనెల 19వ తేదీ నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను వేగవంతం చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పాతాళగంగ, దేవస్థానం డార్మిటరీలు, కల్యాణకట్ట, శివదీక్షా శిబిరాలు, పలుచోట్ల గల శౌచాలయాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.

మహా శివరాత్రికి 1.20 లక్షల లడ్డూలు



మహానంది: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులందరికీ ప్రసాదాలు అందుబాటులో ఉంచుతామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా 1.10 లక్షల లడ్డూ ప్రసాదాలు విక్రయించామన్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా 1.20 లక్షల లడ్డూలను సిద్ధంగా ఉంచుతామన్నారు. లడ్డూ ప్రసాదంతో పాటు పులిహోర ఉంటుందన్నారు. ప్రస్తుతమున్న కౌంటర్లతో పాటు సమాచార కేంద్రం, ఇతర కౌంటర్ల ద్వారా భక్తులకు ప్రసాదాలు విక్రయిస్తామని వెల్లడించారు.

గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

- జనాభా, షాపుల నిష్పత్తి ప్రాతిపదికన రిజర్వేషన్లు
- కర్నూలు జిల్లాకు 10, నంద్యాల జిల్లాకు 11

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నూతన పాలసీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గీత కులాలకు రిజర్వేషన్ ప్రాతిపదికన 2024–26 సంవత్సరాలకు మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు అనుగుణంగా జాయింట్ కలెక్టర్ బి.నవ్య శుక్రవారం తన కార్యాలయంలో లాటరీ ద్వారా ఉప కులాలకు దుకాణాలను కేటాయించారు. గత ఏడాది అక్టోబర్‌లో ఓపెన్ కేటగిరీ కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 204 దుకాణాలు కేటాయించారు. అందులో కర్నూలు జిల్లాలో 99, నంద్యాల జిల్లాలో 105 లాటరీ పద్ధతిలో జనరల్ కేటగిరీ కింద దుకాణాన్ని కేటాయించారు. ఆ మొత్తం వాటిలో 10 శాతం దుకాణాలను గీత కులాలకు వారి జనాభా ప్రాతిపదికన కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొనడంతో జనాభా, షాపుల నిష్పత్తి ప్రకారం కర్నూలు జిల్లాలో 10, నంద్యాల జిల్లాలో 11 దుకాణాలు వచ్చాయి. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మచ్చా సుధీర్ బాబు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటేష్, కర్నూలు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు లాటరీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కర్నూలులో గీత కులాలకు మద్యం దుకాణాల రిజర్వేషన్లు కేటాయిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఉమ్మడి జిల్లాలో ఎవరికి ఎన్నంటే...

జిల్లా	గౌడ్	ఈడిగ	గౌడ
కర్నూలు	3	6	1
నంద్యాల	3	7	1

27న గెజిట్ నోటిఫికేషన్...

గీత కులాల ఉప కులాలకు కేటాయించిన దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఫిబ్రవరి 5వ తేదీ వరకు షరతులకు అనుగుణంగా గీత కులాలు కేటాయించిన రిజర్వేషన్ల ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం జిల్లా కలెక్టర్ల సమక్షంలో డిప్పు ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు. బీసీ సంక్షేమ శాఖ జారీ చేసిన స్థానిక ధృవీకరణ (నేటివిటీ) పత్రం ఆధారంగా దుకాణాలు కేటాయిస్తారు.

కేటాయింపులు ఇలా

కర్నూలు జిల్లాలో.. గౌడ్‌లకు కేటాయించినవి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్, కృష్ణగిరి మండలం, కౌతాళం మండలం. ఈడిగలకు కేటాయించినవి ఆదోని మున్సిపాలిటీ, ఆదోని రూరల్ మండలం, మద్దికెర, కోసిగి, చిప్పగిరి. గౌడలకు ఎమ్మిగనూరు మున్సిపాలిటీ దుకాణాలు కేటాయించారు.

నంద్యాల జిల్లాలో...

నంద్యాల, డోన్, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు మున్సిపల్ కేంద్రాలతో పాటు ఉయ్యాలవాడ, పగిడ్యాల, డోన్ రూరల్, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, పాములపాడు ప్రాంతాల్లో 2016 జనాభా ప్రాతిపదికన ఉప కులాలు దుకాణాలను కేటాయించారు. నంద్యాల ఆర్‌డీఓ రాములు నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఉప కులాలకు దుకాణాలను కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఉప కులాలకు కేటాయించిన దుకాణాల జాబితాను ప్రాంతం/యూనిట్ ప్రకారం ఉప కులాలకు మ్యాపింగ్ చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్‌కు నివేదించారు.

క్లుప్తంగా

ఉపాధి పని ప్రదేశంలో మస్టర్ తప్పనిసరి

తుగ్గలి: ఉపాధి పనులు చేసే ప్రదేశంలో మస్టర్లలో కూలీల హాజరు తప్పని సరిగా వేయాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ మండలంలోని చందోలి, తుగ్గలి మండలంలోని మారెల్ల, తుగ్గలిలో చేపట్టిన ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పని చేసుకుంటే గిట్టుబాటు వేతనం అందుతుందన్నారు. పనికొచ్చిన వెంటనే కూలీలు మస్టర్‌లో హాజరు వేయించుకోవాలని సూచించారు. మస్టర్లలో బినామీ పేర్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూలీలపై ఉందన్నారు. అప్పుడే పనిచేసిన కూలీలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం తుగ్గలి స్త్రీశక్తి భవన్‌లో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనులు నాణ్యతతో చేయించడంతో పాటు, చేసిన పనుల్లో కొలతలు సక్రమంగా తీయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈనెలఖారులో శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఏపీడీ పక్కీరప్ప, ఏపీవోలు హేమసుందర్, వెంకటేశ్వర్లు, క్లస్టర్ టీఏ వెంకప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ధరతో కందులు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): కందులను కనీస మద్దతు ధరతో అమ్ముకునేందుకు రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీసీఎంఎస్ కర్నూలు బ్రాంచీ మేనేజర్ రాజీవ్ తెలిపారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కర్నూలు, కల్లూరు, గూడూరు మండలాల్లో డీసీఎంఎస్ ద్వారా కందుల కొనుగోళ్లు చేపడుతున్నట్లుగా ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కనీస నాణ్యత ప్రమాణాలతో (ఎఫ్ఏక్యూ) కందులను కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. నాణ్యతతో ఉన్న కందులను మద్దతు ధర రూ.7,550తో కొనుగోలు చేస్తామని ప్రకటించారు. సన్న, చిన్నకారు రైతులకు కొనుగోలులో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వివరాల కోసం కల్లూరు మండల రైతులు 9177637605, గూడూరుకు చెందిన రైతులు 9010073455, కర్నూలు మండలానికి చెందిన రైతులు 9381085983ను సంప్రదించాలన్నారు.

మహిళను కాపాడిన సీఐ



పోలీస్‌స్టేషన్ వద్ద పిల్లలతో ఉన్న పుష్పలత

బొమ్మలసత్రం: కుటుంబ కలహాల కారణంగా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన మహిళను టూటౌన్ సీఐ ఇస్మాయిల్ కాపాడారు. గురువారం రాత్రి నంద్యాలలో జరిగిన ఈ ఘటన వివరాలు.. పట్టణంలోని గోపాల్ నగర్ వీధికి చెందిన పుష్పలత, లింగమయ్య దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం.అయితే, ఈ దంపతులు గురువారం రాత్రి గొడవపడ్డారు. కలత చెందిన పుష్పలత ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు సమీపంలోని రైలు పట్టాల వైపు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఇస్మాయిల్ వెంటనే స్పందించి ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్ నంబర్ సిగ్నల్‌ను ట్రేస్ చేశారు. సమీపంలోని రైలు పట్టాల వద్ద ఉన్నట్లు గుర్తించి హుటాహుటిన అక్కడికి చేరుకొని గాలించారు. నంద్యాల నుంచి బయలుదేరిన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు అప్పటికే ఆమె పట్టాలపై పడుకొని ఉంది. గమనించి పక్కకు లాగేశారు. తర్వాత పుష్పలతను స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులతో పంపారు. సీఐ సకాలంలో స్పందించి ఓ మహిళ ప్రాణాలు కాపాడారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటు.. ప్రజాస్వామ్య జీవనాడి

- 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదు కావాలి
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాలు



కర్నూలు(సెంట్రల్): యువతను రాజకీయాల్లోకి తీసుకొచ్చేందుకు, 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులను ఓటరుగా మార్చేందుకు ఎన్నికల సంఘం ప్రయత్నాలను ప్రారంభించింది. అందులో భాగంగా ఎన్నికల సంఘం ఆవిర్భావించిన జనవరి 25వ తేదీని 2011 జాతీయ ఓటరు దినోత్సవంగా ప్రారంభించింది. అందులో భాగంగా విద్యార్థి దశ నుంచే భారతదేశ ఎన్నికల వ్యవస్థ, నియమ, నిబంధనలు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతోంది. వృద్ధుల నుంచి మధ్యవయసు వారు, 18–19 ఏళ్ల యువతీ, యువకుల వరకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నేడు ప్రతిజ్ఞ

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ఎన్నికల ప్రతిజ్ఞ కార్యక్రమాలను ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ, మండల స్థాయిలో డివిజన్, మండల స్థాయి అధికారులు ఎన్నికల ప్రతిజ్ఞ చేస్తారు. అలాగే ప్రతీ బూత్ లెవల్లోనూ బీఎల్ఓలు ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సభను నిర్వహించి ఎన్నికల ప్రాముఖ్యతను తెలియజేస్తారు. ఎన్నికల అంశాలపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు.

జిల్లాలో 20,62, 569 మంది ఓటర్లు

స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ప్రకారం జిల్లాలో 20,62,569 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 10,17074, మహిళా ఓటర్లు 10,45,183 మంది, థర్డ్ జెండర్‌ఓటర్లు 312 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 28,109 మంది అధికంగా ఉన్నారు. మరో వైపు జిల్లాలో సర్వీసు ఓటర్లు 1615, పీడబ్ల్యూడీ ఓటర్లు 23,908 మంది, 80ఏళ్లకు పైబడిన వారు 27,208 మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు సంఖ్య 123గా ఉంది. కాగా, ఎస్ఎస్ఆర్–2025 ప్రకారం 18–19 ఏళ్లమధ్య ఓటర్ల సంఖ్య 27,927గా ఉంది.

స్వేచ్ఛగా ఓటు వేయాలి



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలి. అప్పుడే ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించినట్లు అవుతుంది. ప్రజలకు ఉన్న ఏకైక వజ్రాయుధం ఓటు హక్కు అనే విషయాన్ని తెలుసుకోవాలి.

– పి.రంజిత్‌బాషా, కర్నూలు జిల్లా కలెక్టర్

ఓటర్లుగా నమోదు కావాలి



18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. భారతదేశ ఎన్నికలు ప్రపంచ దేశాలన్నింటికీ ఆదర్శం. యువత తలుచుకుంటే ప్రభుత్వాలే తారుమారు అవుతాయి.

– డాక్టర్ ఇందిరా శాంతి, ప్రిన్సిపాల్, ఫర్‌మెన్ డిగ్రీ కళాశాల

చెట్టుకు ఢీకొన్న మినీ బస్సు



ప్రమాదానికి గురైన మినీ బస్సు

ఆదోని అర్బన్: మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామ సమీపంలో శుక్రవారం మినీ బస్సు చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం మైసూరు నుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనం కోసం మినీబస్సులో 15 మంది బయలుదేరారు. పెద్దతుంబళం గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో సునీతకుమారి, సుజాత, ప్రతీష, సంతోష్, మంజునాథ్, గిరిధర్ అనే ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన ఈ సేవలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులు చేసి షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

హోంగార్డుపై సస్పెన్షన్ వేటు

కర్నూలు: వాహనదారుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాక మామూళ్ల వసూళ్లకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలపై హోంగార్డు ఫిరోజ్ సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో భాగంగా ఫిరోజ్ కొత్తబస్టాండ్‌కు ఎదురుగా ఇన్ గేట్–ఔట్ గేట్ మధ్యలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ ఒక వాహనదారున్ని చేయి చేసుకోవడంపై గుర్తు తెలియని వ్యక్తులు వీడియో తీసి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు వాట్సాప్ ద్వారా సమాచారం చేరవేయడమే కాక సోషల్ మీడియా లో వైరల్ చేశారు. ఈ విషయంపై శుక్రవారం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా విచారణ జరిపించారు. పోలీసు శాఖలో పనిచేస్తున్నప్పటికీ ఆయన వినియోగిస్తున్న ద్విచక్ర వాహనానికి కనీసం నెంబర్ ప్లేట్ కూడా లేకపోవడం దర్యాప్తులో బయటపడింది. దీంతో ఫిరోజ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు.

విధుల్లో పోలీసులు ప్రతిభ చాటాలి

- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు కల్చరల్: విధుల్లో పోలీసులు ప్రతిభ చాటి పోలీసు శాఖకు ఖ్యాతి తేవాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. రాయలసీమ రేంజ్‌లోని ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతులు వచ్చాయి. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో పదోన్నతులు పొందిన ఎస్ఐలు డీఐజీ కోయ ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతులు రావడం అభినందనీయమని, మిగిలిన సర్వీసును కూడా రిమార్కు లేకుండా పూర్తి చేయాలని ఎస్ఐలకు డీఐజీ సూచించారు. వీరందరూ 1991 బ్యాచ్‌కు చెందినవారు. ఈ కార్యక్రమంలో డీఐజీ మేనేజర్ విజయరాజు పాల్గొన్నారు.

సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొండ మనోహర్



కర్నూలు(సెంట్రల్): కర్నూలుకు చెందిన సీనియర్ న్యాయవాది కొండ మనోహర్ సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సంబంధించి సీబీఐ కోర్టు ఉంది. ఈ కోర్టులో ఉన్న కేసుల్లో ప్రభుత్వం తరపున తన వాదనలు వినిపిస్తారు. కాగా, ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. 1994లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిలో స్థిరపడిన ఆయన గతంలో కర్నూలు కోర్టులలో చీఫ్ డిఫెన్స్ కౌన్సెల్‌గా సేవలు అందించారు. కాగా, సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన కొండ మనోహర్ ను సీనియర్ న్యాయవాదులు ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, ఎ.రామసుబ్బారెడ్డి, వై.శ్రీనివాసులు, వి.నాగాంజనేయులు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రకాస్‌రెడ్డి మద్దెల శ్రీనివాసరెడ్డి అభినందించారు.

జాతీయ బీచ్ హ్యాండ్‌బాల్‌లో సత్తా చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్‌రెడ్డి

కర్నూలు (టౌన్): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 38వ జాతీయ స్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ స్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులు జగదీష్, శివకుమార్, రియాజ్‌లను వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలను అవకాశంగా మలచుకొని ప్రతిభ చాటాలన్నారు. క్రీడాకారులను తమ వంతుగా ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి రుద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, తదితరులు

కర్నూలు (సిటీ): క్లస్టర్ యూనివర్సిటీ ఐదవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు వైస్ చాన్స్‌లర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించామని, మొత్తం 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 206 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని క్లస్టర్ యూనివర్సిటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ తెలిపారు. 96 శాతం మంది యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సమావేశంలో డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ ఆర్.బాలకృష్ణయ్య శెట్టి పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 310 మంది ఉత్తీర్ణత



పరుగుపందెంలో పోటీ పడుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలం మైదానంలో పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం 14వ రోజు 600 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 484 మంది బయోమెట్రిక్ పరీక్షకు హాజరయ్యారు. వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ చుట్టు కొలతలు వంటి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో 310 మంది అభ్యర్థులు ప్రతిభ కనపరచి ప్రధాన పరీక్ష (మెయిన్స్)కు అర్హత సాధించారు.

వివాహిత అదృశ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన యశోధ అనే వివాహిత అదృశ్యమైంది. ఈమె ఈనెల 21న తిరుపతికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

స్కూళ్లపై పర్యవేక్షణకు క్లస్టర్ విధానం

- విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే సమీప పాఠశాలల్లో విలీనం
- పాఠశాల విద్యలో మార్పులపై అవగాహన కార్యక్రమంలో కమిషనర్
- పాల్గొన్న కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, డీఈఓలు



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల విద్య కమిషనర్ విజయరామ రాజు

కర్నూలు సిటీ: పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చినట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయరామ రాజు పేర్కొన్నారు. శుక్రవారం నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో పాఠశాల విద్య బలోపేతంపై ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, డీఈఓ, ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో ఆయన వర్క్‌షాపు నిర్వహించారు. పాఠశాల విద్యలో తీసుకొస్తున్న మార్పులు, జీఓ 117 రద్దు, స్కూల్ కాంప్లెక్స్ విధానాల్లో మార్పులు, నూతనంగా తీసుకొచ్చిన క్లస్టర్ విధానంతో కలిగే ప్రయోజనాలు తదితర వాటి గురించి కమిషనర్ వివరించారు. స్కూల్ కాంప్లెక్స్ విధానంలో ఆ కాంపెక్స్ పరిధిలోని స్కూళ్లపై మండల స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తున్నారని, దీని వల్ల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అందుకే క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చామని, దీని వలన ఆయా క్లస్టర్ పరిధిలోని స్కూళ్లపై ఆ క్లస్టర్ హెచ్‌ఎం రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేయడంతో ప్రయోజనం ఉంటుందన్నారు. అయితే ఇక్కడ ఎంఈఓలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు ఉంటాయని, ఎవరు ఆందోళన చెందకూడదని, ఎంఈఓల పవర్స్ వారికే ఉంటాయని చెప్పారు.ఇకపై మండల విద్యాధికారుల బదిలీలకు కౌన్సెలింగ్ ఉండదని, తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీల మాదిరిగానే ఉంటాయన్నారు. స్కూళ్ల ఎన్‌రోల్‌మెంట్‌లో తప్పులు ఉంటున్నాయని, వాస్తవమైన వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రతి పంచాయతీకి ఓ మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు

ప్రతి గ్రామ పంచాయతీలో ఓ మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేస్తామని పాఠశాల విద్య కమిషనర్ చెప్పారు. ఎక్కడైనా విద్యార్థులు తక్కువగా ఉంటే అక్కడి 3,4,5 తరగతులను 2,3 కి.మీ దూరంలో ఉండే మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పంపించేటట్లు అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించాలని, ఆ పిల్లలకు అవసరమైన రవాణా చార్జీలు సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ఇకపై కొనసాగించే ఉద్దేశం లేదన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్ విధానంలో ప్రతి తరగతికి ఒక టీచర్ ఉంటారని, పిల్లలకు కూడా మంచి విద్య అందుతుందన్నారు. ఏకోపాధ్యాయ స్కూళ్లను బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల కలెక్టర్లు పి.రంజిత్ బాషా, రాజ కుమారి గనియా, కర్నూలు జేసీ డా.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జెడ్పీ సీఈఓ నారపరెడ్డి, ఆర్జేడీ శామ్యూల్, కర్నూలు, నంద్యాల డీఈఓలు ఎస్.శ్యామూల్ పాల్, జనార్దన్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా..

- ఆటో బోల్తా..ఒకరు దుర్మరణం
- మరో ఐదుగురికి గాయాలు



మృతిచెందిన నాగరాజు (ఫైల్)

ఆదోని అర్బన్: అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా..మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విరుపాపురం గ్రామంలో అయ్యప్పరెడ్డి అనే వ్యక్తి మరణించాడు. ఈయన బంధువులైన నాగరాజు, వాణి దంపతులు, ఎర్రమ్మతో పాటు మరో ఐదుగురు గూడూరు మండలం రేమట గ్రామం నుంచి వచ్చారు. అంత్యక్రియలు పూర్తి అయిన తర్వాత తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. విరుపాపురం దాటి కొద్ది దూరం వెళ్లగానే అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో నాగరాజు(45) అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య వాణి, ఎర్రమ్మతోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె సంతానం. నాగరాజు కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదోని పోలీసులు తెలిపారు.

నల్సా పథకాలపై అవగాహన అవసరం

కర్నూలు (సిటీ): నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) రూపొందించిన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ది అన్నారు. సిల్వర్‌జూబ్లీ కళాశాలలో నల్సా న్యూ మాడ్యుల్ లీగల్ సర్వీసెస్ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయిగోపాల్ హాజరయ్యారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయ సేవల పథకం, పిల్లల కోసం చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ పథకం ఉన్నాయన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు గవర్నమెంట్ గుర్తింపు కార్డు, అసంఘటిత కార్మికులకు ఈ–శ్రమ్ కార్డులు లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా ఇప్పించామని తెలిపారు. వినియోగదారుల హక్కుల గురించి జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు కె.కిషోర్ కుమార్ వివరించారు. బాల కార్మికుల నిషేధం, బాలికల అక్రమ రవాణా నిషేధం గురించి చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల తెలిపారు. తదనంతరం సిల్వర్‌జూబ్లీ కాలేజ్ ఆఫ్ క్లస్టర్ యూనివర్సిటీ నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఉత్తీర్ణులైన పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. బాల్య వివాహాలు, బాలకార్మికుల గురించి పిల్లలు స్కిట్ ప్రదర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివ, డీసీపీఓ శారద, సీడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా బేగం, జిల్లా వినియోగదారుల ఫోరం మెంబర్ నజీమా కౌసర్, సిల్వర్‌జూబ్లీ కాలేజ్ ఆఫ్ క్లస్టర్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, లెక్చరర్ డాక్టర్ ఎల్లా కృష్ణ, ఎన్‌జీఓ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ హుసేన్ బాషా పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం



డ్వామా పీడీ వెంకటరమణయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్):ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం దారుణమని ఎన్ఆర్ఈజీఎస్ జేఏసీ నాయకులు అన్నారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య కలసి శుక్రవారం సాయంత్రం వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్యకు గురయ్యాడంటే ఉపాధి సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఉపాధి పనులకు వచ్చిన కూలీల హాజరు వేసుకుని బతుకుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను నరికి చంపడం దారుణమని జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న తెలిపారు. హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎలాంటి ఫిర్యాదులు లేవని, అందరి మేలు కోరే మనస్తత్వం ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య ఉపాధి సిబ్బందిని తీవ్రంగా కలచి వేసిందని పేర్కొన్నారు. ఇటువంటి దురదృష్టకర సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీ

కర్నూలు: నాటుసారా నిర్మూలనలో భాగంగా ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కొల్లంపల్లితాండా వద్ద తనిఖీలు చేపట్టారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్,ఎస్ఐ నవీన్ బాబు వారి సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా కొల్లంపల్లితాండాకు చెందిన సుగాలి కు మార్ నాయక్, మూడావత్ పార్వతి బాయి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా అనుమానంతో తనిఖీలు చేయ గా 18 లీటర్ల నాటుసారా బయటపడింది. కుమార్ నాయక్ పారిపోగా భార్య పార్వతీ బాయిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. పారిపోయిన కుమార్ నాయక్ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

అతని అడుగులు ఆలోచించమంటున్నాయ్!



21 ఏళ్ల యువకుడు పర్యావరణ పరిరక్షణ పేరుతో 'సేవ్ నేచర్.. సేవ్ వాటర్' అంటూ కర్ణాటక నుంచి కాశ్మీరు వైపు అడుగులు వేశాడు. ఎనిమిది నెలల క్రితం ప్రారంభమైన సాహస యాత్ర కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించి నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చేరుకుంది. కర్ణాటక రాష్ట్రం వర్తూరుకు చెందిన సుమంత్ అశ్విన్ అనే యువకుడి చేపట్టిన తన యాత్ర గురించి ఇలా చెప్పారు. 'బెంగళూరులో ఇంజినీరింగ్ చదువుతూ మధ్యలో మానేశాను. పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది. ప్రకృతిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం. ప్రజల్లో అవగాహన కల్పించేందేందుకు ఈ యాత్ర చేస్తున్నా. ప్రజల నుంచి స్పందన వస్తోంది. భోజన, వసతి కల్పిస్తున్నారు. ప్రతి రోజు 24 నుంచి 30 కి.మీ యాత్ర సాగుతోంది. ఈ కుక్కపిల్ల పేరు భైరవ. ఇది రోజుకు నాతో పాటు పది కి.మీ నడుస్తోంది. మూడేళ్లపాటు యాత్ర కొనసాగించి చివరగా జమ్ముకాశ్మీర్‌లో ముగిస్తా' అని తెలిపారు.

– కోవెలకుంట్ల

సోలో ట్రావెల్ సో బెటర్!



నేడు నేషనల్ టూరిజమ్ డే

పర్యటనలకు మనదేశం పుట్టిల్లు. తీర్థయాత్రలు మన సంస్కృతిలో భాగం. పర్యటన... ఒక పాఠం... రచనకు అదే మూలం. జీవన వైవిధ్యత అధ్యయనానికి ఓ మాధ్యమం. పర్యటనలు ఒత్తిడి నుంచి సాంత్వన కలిగిస్తాయి. జీవితాన్ని కొత్తగా చూడడానికి కళ్లు తెరిపిస్తాయి. అణగారిన జీవితేచ్ఛను తిరిగి చిగురింపచేస్తాయి. అందుకే... ఫ్రెండ్స్‌తో టూర్‌లు... ఫ్యామిలీ టూర్‌లు... అలాగే... మహిళల సోలో ట్రావెల్స్ కూడా పెరిగాయి.

మహిళలు ఒంటరిగా పర్యటనలు చేయడానికి సందేహించాల్సిన అవసరమేలేదిప్పుడు. ప్రపంచంలో మనుషులందరినీ కలిపే భాష ఇంగ్లిష్. మనదేశంలో పర్యటనలైనా, విదేశీ పర్యటనలైనా ఇంగ్లిష్ భాష వస్తే చాలు. అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం లేకపోయినప్పటికీ మనకు అవసరమైన సమాచారాన్ని అడగగలగడం, చెప్పింది అర్థం చేసుకోవడం తెలిస్తే చాలు. సేఫ్టీ, సెక్యూరిటీ నియమాలు పాటిస్తూ ప్రయాణం కొనసాగిస్తే మహిళలు ఒంటరిగా ప్రయాణించినా సరే ఎటువంటి ఇబ్బందులూ ఎదురు కావన్నారు రజని లక్కా. ఆత్మవిశ్వాసం ఉండాలి, కనీసం ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు కనిపించి తీరాలి. బిత్తర చూపులు చూస్తే మోసగించేవాళ్లు అక్కడిక్కడే ప్రత్యక్షమవుతారు. మరో తప్పనిసరి జాగ్రత్త ఏమిటంటే సహ ప్రయాణికులతో కూడా డబ్బు లావాదేవీలు చేయకూడదు. అలాగే పర్యటనను ఆస్వాదించాలంటే లగేజ్ తక్కువగా ఉండాలి. ట్రావెల్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. సోలోగా పర్యటనకు వెళ్లిన వాళ్లు ఇంట్లో వాళ్లకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుండాలి. అయితే లైవ్ లొకేషన్స్ ఇతరులకు ఎవ్వరికీ షేర్ చేయవద్దు. సోషల్‌మీడియాలో లైక్‌ల కోసం తాపత్రయపడి టూరిస్ట్ ప్లేస్‌లో ఫొటోలు తీసుకుని గంటకో పోస్ట్ పెడుతూ ఉంటే మన కదలికలు ఎప్పటికప్పుడు ప్రపంచానికి తెలిసిపోతుంటాయి. మనల్ని ఎవరైనా రహస్యంగా వెంటాడుతున్నట్లయితే చేజేతులా వారికి దారి చూపించినట్లవుతుంది. పర్యటన వివరాలను సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌తో షేర్ చేయాలనుకుంటే పర్యటన పూర్తయి ఇంటికి వచ్చిన తర్వాత పోస్ట్ చేసుకోవచ్చు. ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో ఒంటరిగా ప్రయాణం చేయవచ్చని చెబుతున్నారు జెన్నిఫర్. మనవాళ్లకు అడ్వెంచర్ టూర్‌లు చేయడం కంటే నియమాలను ఉల్లంఘించడంలో సాహసాన్ని ప్రదర్శిస్తుంటారు. ఫొటోగ్రఫీ నిషేధం అన్న చోట ఫొటోలు తీసుకుంటారు. సెక్యూరిటీ కళ్లు కప్పి నిషేధిత ప్రదేశాల్లోకి, డేంజర్ జోన్‌లలోకి దొంగ చాటుగా వెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటి ప్రయత్నాలు ప్రమాదకరం మాత్రమే కాదు నేరం కూడా. పర్యటనను ఆస్వాదించడం కూడా ఒక కళ. ఎప్పటికీ వన్నె తగ్గని కళ.

సురక్షితంగా వెళ్లిరావచ్చు!

ఒంటరి పర్యటనలు ఆస్వాదించే వారి సంఖ్య పెరుగుతోంది. కెనడాలో మాంట్రియల్‌లో నేను ప్రయాణించిన టూరిస్ట్ బస్‌లో తొమ్మిది దేశాల వాళ్లున్నారు. అంత మందిలో ఇద్దరు మినహా అంతా సోలో ట్రావెలర్సే. అయితే వెళ్లే ముందు పర్యటనకు వెళ్లే ప్రదేశం గురించి ప్రాథమిక వివరాలైనా తెలుసుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెంట్, జీపీఎస్ సౌకర్యాలున్నాయి కాబట్టి స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, ధైర్యంగా ఒంటరి ప్రయాణాలు చేయవచ్చు. భద్రంగా వెళ్లి, సంతోషంగా తిరిగి రాగలిన పరిస్థితులున్నాయి.

– రజని లక్కా, సోషల్ యాక్టివిస్ట్



కశ్మీర్‌లో తప్ప సోలో ట్రావెలర్‌గా మరెక్కడా నాకు ఇబ్బంది ఎదురుకాలేదు. తమిళనాడు ప్రజలు సింపుల్‌గా ఉంటారు. 76 దేశాల్లో పర్యటించిన తరవాత నాకనిపించిందేమిటంటే... ప్రపంచంలో ఉన్నవన్నీ మనదేశంలో ఉన్నాయి. మనదేశంలో లేనిది ప్రపంచంలో మరెక్కడా లేదు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతం బొలీవియాను

మనదేశం ప్రపంచానికి ప్రతీక

తలపిస్తుంది. మన దగ్గర ఎడారులు, హిమాలయాలు, బీచ్‌లు ఒక్కొక్కటి ఒక్కోదేశంలో ప్రత్యేకమైన టూరిస్ట్ ప్లేస్‌ను తలపిస్తాయి. ఆర్కిటెక్చర్ పరంగా తమిళనాడు ఆలయాలు, రాజస్థాన్ కోటలకు ప్రపంచంలో మరేవీ సాటి రావు.

– పొనుగోటి నీలిమ, ట్రావెలర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

ట్రావెల్ లైట్... ట్రావెల్ సేఫ్

ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశమంతటా పర్యటించాను. ఏడు దేశాలు కూడా చూశాను. మనల్ని మనం మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగింది పర్యటన ద్వారానే. సోలో ట్రావెల్ అయితే మన అభిరుచికి తగినట్లు టూరిస్ట్ ప్రదేశాలను ఎంచుకోవచ్చు. ఇప్పుడు పర్యటనలకు సౌకర్యాలు బాగున్నాయి. సోలో ట్రావెల్‌లో అన్నీ మనమే సమకూర్చుకోవడం కష్టం అనిపిస్తే టూర్ ప్యాకేజీలో వెళ్లవచ్చు. ఎక్కడికి వెళ్తే ఆ ప్రదేశంలో స్థానికులతో కలిసిపోతున్నట్లుగా ఉండాలి. మనల్ని మనం ఎక్స్‌పోజ్ చేసుకునే ప్రయత్నం చేయరాదు. ఆ ప్రదేశానికి సరిపోలని వస్త్రధారణ, మాటల ద్వారా ఇతరుల దృష్టి మన మీద సులువుగా పడుతుంది. ప్రమాదాలు కూడా అక్కడి నుంచే మొదలవుతాయి. సోలో ట్రావెల్ చేసే మహిళలు జాగ్రత్తగా ఉండాల్సింది ఈ విషయంలో మాత్రమే.

– జెన్నిఫర్ ఆల్ఫాన్స్, డైరెక్టర్



– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మీసాలు.. గడ్డాలకు ఖరీదైన తైలాలు





మింగ మెతుకు లేదు గాని మీసాలకు సంపెంగ నూనె అని మనకో సామెత ఉంది. స్తోమతకు మించి డాబులొలికే దిలాసారాయుళ్ల తీరును ఎద్దేవా చేయడానికి పుట్టిన సామెత అది. ఆనాటి సమాజంలో సంపన్నులైన పెద్దమనుషులు మీసాలకు సంపెంగ నూనెలు, ఇతరేతర సుగంధ తైలాలను పూసుకుంటూ, దర్జా ప్రదర్శించేవారు. ఇదివరకు కాస్త వయసు మళ్లినవాళ్లే ఏపుగా గడ్డాలు పెంచేవాళ్లు. ఇటీవలి కాలంలో కుర్రాళ్లు కూడా ఎడాపెడా గడ్డాలు పెంచేసుకుంటున్నారు. కొందరు అడ్డదిడ్డంగా గడ్డాలు పెంచుకుంటూ, చిరిగిన జీన్స్ తొడుక్కుని వీథుల్లో ఆవారాగా తిరుగుతుంటే, ఇంకొందరు సూటు బూట్లు ధరించి, పద్ధతిగా గడ్డాలను రకరకాల తీరుల్లో కత్తిరించుకుంటూ, గడ్డాలు దట్టంగా పెరగడానికి నానా రకాల పోషక తైలాలు వాడుతున్నారు. గడ్డాల మీద యువతరం మోజు గమనించిన మార్కెట్ శక్తులు ఊరుకుంటాయా? యువకుల మోజును సొమ్ము చేసుకోవడానికి గడ్డాల పోషణకు ప్రత్యేకంగా రూపొందించిన రకరకాల తైలాలను మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. బియర్డ్ ఆయిల్స్, బియర్డ్ క్రీమ్స్ పురుషుల సౌందర్య ఉత్పత్తులలో కీలకంగా మారిపోయాయి. తలకు రాసుకునే హెయిరాయిల్స్, బ్రిలియంటైన్స్, జెల్స్‌తో పోల్చుకుంటే మీసాలు గడ్డాలకు పూసుకునే బీర్డ్ ఆయిల్స్, క్రీమ్స్ ధరలు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటున్నా, గడ్డాలరాయుళ్లు ఏమాత్రం వెనుకాడటం లేదు.

మంచి ఆరోగ్యాన్ని తేగలవు



చలికాలం మొదలు కాగానే మార్కెట్టులో విరివిగా కనిపించే వాటిలో తేగలు ఒకటి. వీటిని కొన్ని ప్రాంతాలలో గేగులు అని అంటారు. వీటిని తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే తేగల్లో ఆరోగ్య పోషకాలు పుష్కలంగా వున్నాయి. అవేంటో తెలుసుకుంటే ఇప్పుడైనా వీటిని తినేందుకు త్వరపడతారు.

తేగలను ఉడికించి మిరియాలు, ఉప్పు అద్దుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. తేగలు తింటే బరువు తగ్గడంతోపాటు కాన్సర్ కూడా దూరం అవుతుంది. అలాగే తేగలను ఉడికించి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని పిండి కొట్టి, కొబ్బరిపాలు, బెల్లం, ఏలకుల పొడి చేర్చి తీసుకుంటే కొలెస్ట్రాల్ ఇట్టే కరిగిపోతుంది.

తేగలపిండితో రొట్టెలు చేసుకుని తినొచ్చు. ఇందులోని పీచు జీర్ణక్రియకు ఎంతగానో తోడ్పడుతుంది. పెద్ద పేగుల్లో మలినాలను చేరకుండా చేస్తుంది. టాక్సిన్లను తొలగిస్తుంది. ఇందులోని కాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తంలో తెల్ల కణాలను వృద్ధి చేస్తుంది. శరీరానికి చలువనిచ్చి, నోటిపూతను తగ్గిస్తుంది. తేగలను పాలలో ఉడికించి ఆ పాలను చర్మానికి పూతలా రాసుకుంటే చర్మం మిలమిలలాడుతుంది.

తేగలు దొరికే రోజుల్లో పిల్లలకు రెగ్యులర్‌గా వీటిని పెడితే ఎముకల ఎదుగుదలకు దోహద పడుతుంది. తాటి తేగలను మధుమేహం ఉన్న వారు కూడా తినవచ్చు. రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించి మధుమేహాన్ని అదుపు చేస్తుంది. రక్తం తక్కువగా ఉండి అనీమియాతో బాధపడుతున్నవారు ఈ సీజన్‌లో వచ్చే తేగలను తింటూ ఉంటే మంచి ఫలితం కనపడుతుంది.

మంచిది కదా అని అతిగా తింటే మాత్రం చెరుపు చేస్తుంది.

● యోగా



ఎముకల బలానికి అధో ముఖం

ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి, అకస్మాత్తుగా పడిపోయే ప్రమాదాన్ని నివారించగల శక్తి అధో ముఖానానికి ఉంది. రోజూ ఈ ఆసనాన్ని దినచర్యలో భాగం చేస్తూ ఉంటే మైండ్, బాడీ చురుకుదనం పెరుగుతుంది.

ఇలా వేయాలి....

● మ్యాట్ పైన లేదా నేలపైన నిటారుగా నిల్చొని చేతులను పైకి స్ట్రెచ్ ఉంచాలి. తర్వాత నడుం భాగం వంచుతూ, చేతులను పూర్తిగా నేలమీద ఆనించాలి. ● చేతులను పాదాలకు దూరంగా తీసుకెళుతూ త్రికోణాకారంలో ఉండాలి. ● కాలి వేళ్ల మీద ఉంటూ మడమలను పైకి లేపాలి. శరీర బరువు చేతులు, కాలిముని వేళ్ల మీద ఉంటుంది. ● నిమిషం సేపు ఇదే భంగిమలో ఉండాలి. తిరిగి యథాస్థితికి రావాలి. ఇలా ఒకటి నుంచి 3 సార్లు ఈ ఆసనాన్ని పునరావృతం చేయాలి.

ఈ ఆసనం వేయటానికి మొదట్లో కాస్త కష్టంగా వున్నా రోజూ సాధన చేస్తూ ఉంటే సులువవుతుంది. వెన్నెముక, కాళ్ళను బలోపేతం చేస్తుంది. అదే విధంగా ఏకాగ్రత పెంచి, ఒత్తిడి నుండి రిలీఫ్‌ని ఇస్తుంది. అజీర్తి సమస్యలు దూరమవుతాయి. నడుము నొప్పి తగ్గుతుంది. ఆస్టియో పోరోసిస్ సమస్య నుండి రక్షిస్తుంది. సైనస్, ఆస్తమా, పీరియడ్స్‌లో వచ్చే సమస్యల నుంచి రిలీఫ్‌ని ఇస్తుంది. ఇన్ని ప్రయోజనాలని ఈ ఆసనం ద్వారా పొందవచ్చు.

సాక్షి సినిమా

టాక్సిక్‌లో ఫిక్స్

'కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2' వంటి చిత్రాలతో రాఖీ భాయ్‌గా పాన్ ఇండియా స్థాయిలో ఎంతో గుర్తింపు సొంతం చేసుకున్నారు యశ్. ఆ సినిమాల తర్వాత యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ చిత్రానికి మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ కొన్నాళ్లుగా జరుగుతోంది. అయినప్పటికీ హీరోయిన్ ఎవరనే విషయంపై చిత్రయూనిట్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో కియారా అద్వానీ, కరీనా కపూర్, నయనతార వంటి హీరోయిన్ల పేరు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా యశ్‌కి జోడీగా నయనతార నటిస్తున్నట్లు ఈ మూవీలో కీలక పాత్ర చేస్తున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ మాటలతో స్పష్టత వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్షయ్ ఒబెరాయ్ మాట్లాడుతూ– ''యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమా షూటింగ్‌తో ప్రస్తుతం బిజీగా ఉన్నాను. ఇందులో నయనతార కూడా భాగమయ్యారు. ఇంతకు మించి వివరాలను నేను ఇప్పుడే వెల్లడిస్తే బాగోదు కాబట్టి నన్ను ఎక్కువగా అడగకండి. త్వరలోనే గీతూ మోహన్‌దాస్ ఓ ప్రకటన చేస్తారు. అప్పటివరకు వేచి చూడండి'' అని పేర్కొన్నారు. ఇక నయనతార గురించి దర్శక–నిర్మాతల నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.


● నయనతార

వేసవిలో జాట్

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన హిందీ చిత్రం 'జాట్'. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా ఇతర పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని వేసవిలో ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించి, కొత్త పోస్టర్ విడుదల చేశారు. ''భారీ యాక్షన్ మూవీగా 'జాట్' రూపొందింది. 'పుష్ప 2: ది రూల్' సినిమాతో పాటు ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్లలో ప్రదర్శితమైన 'జాట్' టీజర్‌కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: రిషి పంజాబీ, సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయికుమార్ మామిడిపల్లి, జయ ప్రకాశ్ రావు (జేపీ).


● సన్నీ డియోల్

అంతే తేడా!

'ఇట్స్ ఓకే.. మూవ్ ఆన్ అవ్వాలిరా.. తప్పదు' అంటూ అనంతిక సనీల్‌కుమార్ చెప్పిన డైలాగ్‌తో '8 వసంతాలు' మూవీ టీజర్ ఆరంభమైంది. 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా పసునూరి, స్వరాజ్ రెబ్బా ప్రగడ, సమీరా కిశోర్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. ''ఎవరి తుఫాన్‌లు వారికి ఉంటాయి లోపల... కొందరు బయట పడతారు, ఇంకొందరు ఎప్పటికీ పడరు... అంతే తేడా'' అంటూ కన్నా పసునూరితో అనంతిక సనీల్ కుమార్ చెప్పే డైలాగ్స్ కూడా టీజర్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమేరా: విశ్వనాథ్ రెడ్డి.


● రవితేజ, అనంతిక

అఖండలో...

'సింహా, లెజెండ్, అఖండ' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ మూవీలో హీరోయిన్‌గా సంయుక్తా మీనన్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం మహా కుంభమేళాలో జరుగుతోంది. సినిమాలోని కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ హీరోయిన్ ఎవరు? అనే విషయంపై చిత్రబృందం ప్రకటించలేదు. తాజాగా సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా ఎంపిక అయినట్లు మేకర్స్ ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: సి. రాంప్రసాద్, సంతోష్ డి.


● సంయుక్తా మీనన్

వెంకటలచ్చిమి ప్రతీకారం


● పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్ 100, వెంకీ మామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, మంగళవారం' వంటి పలు సినిమాల్లో నటించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు పాయల్ రాజ్‌పుత్. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో 'వెంకటలచ్చిమి' అనే పాన్ ఇండియా చిత్రం ఆరంభమైంది. ముని దర్శకత్వంలో సినిమా టికెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రాజా, ఎన్‌ఎస్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం అనంతరం ముని మాట్లాడుతూ– ''వెంకటలచ్చిమి' కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. గిరిజన ప్రాంతానికి చెందిన వెంకటలచ్చిమి అనే అమ్మాయి ప్రతీకారం, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్నాం'' అని తెలిపారు. పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ– ''మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నా, నచ్చకపోవడంతో తిరస్కరించాను. మునిగారు 'వెంకటలచ్చిమి' కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ చిత్రం తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అనేంత బలమైన కథ ఇది'' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిశా.

ప్రేమ కోసం...

విరాజ్ రెడ్డి చీలం హీరోగా నటించిన చిత్రం 'గార్డ్'. రివెంజ్ ఫర్ లవ్ (ప్రేమకోసం ప్రతీకారం) అనేది ఉపశీర్షిక. జగ పెద్ది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ హీరోయిన్లుగా నటించారు. అనసూయ రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరిలో విడుదల కానుంది. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన చిత్రం 'గార్డ్'. సుశాంత్ అనే సెక్యూరిటీ గార్డుగా విరాజ్ కనిపిస్తారు. విరాజ్ యాక్షన్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకునేలా ఉంటాయి. యాక్షన్–ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో లవ్ ట్రాక్ కూడా ఉంటుంది. ప్రేమ పేరుతో ఊహించని శక్తులపై హీరో చేసే పోరాటాలు ఈ సినిమాకు హైలైట్'' అని యూనిట్ పేర్కొంది.



● విరాజ్ రెడ్డి

ఓటీటీ ఇది చూడొచ్చు

బీ కేర్‌ఫుల్...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం డేంజరస్ వాటర్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



జీవితమన్నది క్షణభంగురం. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కాబట్టి అనుక్షణం అప్రమత్తత అవసరం. ఈ నేపథ్యంలోనే రూపొందిన హాలీవుడ్ సినిమా 'డేంజరస్ వాటర్స్'. ఇదో పూర్తి థ్రిల్లర్ జోనర్ మూవీ. సినిమా మొత్తం ఓ మూడు పాత్రలతో 90 శాతం సముద్రంలోనే జరిగిన కథ. సినిమాలో ఉన్నది మూడు పాత్రలే అయినా మంచి స్క్రీన్‌ప్లేతో చూసే ప్రేక్షకులను మాత్రం కట్టిపడేసే ప్రయత్నం చేశారు దర్శకుడు జాన్ బర్. ఈ సినిమా లయన్స్ గేట్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. ఇది పెద్దవాళ్లు మాత్రమే చూసే సినిమా. ఇక ఈ చిత్రకథ విషయానికొస్తే... అల్మా తన కూతురు కోసం ఓ సూపర్ వెకేషన్ ప్లాన్ చేస్తుంది. తన బాయ్ ఫ్రెండ్ డెరెక్‌తో కలిసి కూతురుతో పాటు బోట్‌లో బెర్ముడా వరకు ట్రావెల్ చేసి, సముద్రం మధ్యలో తన బర్త్ డే సెలబ్రేట్ చేసుకోవాలన్నది ప్లాన్. దీనికి కూతురు రోజ్ అయిష్టంగానే ఒప్పుకుంటుంది. ప్రయాణం మొదలైనపుడు అంతా బాగానే ఉంటుంది. దారి మధ్యలో వేరే ఒక బోట్ వీళ్లకు ఎదురుగా వచ్చి అల్మాను చంపేసి డెరెక్‌ను గాయపరుస్తారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో నడి సంద్రంలో రోజ్ ఒంటరిదైపోతుంది. దాడి చేయడానికి వచ్చినవాళ్లు బోట్‌లోని రేడియోను అలాగే బోట్ ఇంజన్‌ను ధ్వంసం చేసి వెళతారు. చుట్టూ నీళ్ల తప్ప ఏమీ లేని ఆ ప్రాంతం నుండి రోజ్ ఎలా బయటపడిందనేది సినిమాలోనే చూడాలి. ఈ సినిమా చాలా నెమ్మదిగా ప్రారంభమై, ఉత్కంఠభరితంగా సాగుతూ ఊహకందని క్లైమాక్స్ ట్విస్టులతో అద్భుతంగా ముగుస్తుంది. గంటా నలభై నిమిషాల నిడివితో సాగే ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవాళ్లకి ఇదో సూపర్ సినిమా. మరింకేం... ఈ వీకెండ్ 'డేంజరస్ వాటర్స్'లోకి మీరూ ట్రావెల్ చేయండి.

– ఇంటూరు హరికృష్ణ